క్లుప్తంగా

'నులి' నివారణపై అవగాహన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

భీమిని/వేమనపల్లి: జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భీమిని ఎంపీడీవో గంగామోహన్, వేమనపల్లి ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, వైద్యులు అర్చన, రాజేష్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయాల్లో మంగళవారం భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి మండలాల ఏఎన్ఎంలకు, ఆశ, వైద్య సిబ్బందికి వేర్వేరుగా అవగాహన కల్పించారు. ఈ నెల 10న జాతీయ నులిపురుగు నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని పోస్టర్ ఆవిష్కరించారు. 1 నుంచి 19సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలకు అల్బెండాజోల్ మాత్రలు వేయాలని సూచించారు.

గుండెకు అత్యాధునిక వైద్యం



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని టచ్ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాథ్‌ల్యాబ్‌లో గుండె నొప్పితో ప్రాణాపాయ స్థితిలో వచ్చిన వారికి వెంటనే వైద్యం అందించి ప్రాణాలు కాపాడుతున్నామని టచ్ ఆసుపత్రి వైద్యులు మంగళవారం విలేకర్ల సమావేశంలో తెలిపారు. ఇటీవల తీవ్రమైన గుండెనొప్పితో పాటు, బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన రోగికి విజయవంతంగా చికిత్స చేసి బతికించినట్లు తెలిపారు. రోగికి ఛాతిలో నొప్పి వచ్చిన ఒక గంటలోపు ఆసుపత్రికి చేరితే, మెరుగైన వైద్య సేవలు అందించి కాపాడేందుకు అవకాశం ఉంటుందని, 2గంటలు దాటి వచ్చే వారికి చికిత్సను అందించి బతికించడం కష్టమన్నారు. కార్డియాలజిస్టు డాక్టర్ రాజేశ్ ఖుర్కండే, డాక్టర్ బి. సుమన్, డాక్టర్ విటాస్ బిల్ల, డాక్టర్ అథెర్ పాల్గొన్నారు.

'ఉపాధి' వినియోగించుకోవాలి



ప్రహరీ ప్రారంభిస్తున్న డీఆర్డీవో కిషన్

లక్సెట్టిపేట: గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని ప్రజలు వినియోగించుకోవాలని డీఆర్డీవో కిషన్ అన్నారు. మండలంలోని జెండా వెంకటాపూర్‌లో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన స్కూల్ ప్రహరీని మంగళవారం ఆయన ప్రారంభించారు. ప్రజలు వేసవి కాలం సమీపిస్తున్నందునా ఉపాధిహామీ పథకం ద్వారా అందించే పశువుల కొట్టాలు, గడ్డి పెంపకం, కిచెన్ షెడ్లను ఉపయోగించుకోవాలని తెలిపారు. కూలీలందరికి పనులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరోజ, ఏపీవో వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

'ఫీల్డ్ అసిస్టెంట్‌పై కేసు అన్యాయం'



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు నక్క రాజన్న

భీమారం: సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామపంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటస్వామిపై కేసు చేయడం అన్యాయమని మంచిర్యాల జిల్లా అసిస్టెంట్ సంఘం అధ్యక్షుడు నక్క రాజన్న అన్నారు. కేసు ఉపసంహరించుకోవాలన్నారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఫీల్డ్ అసిస్టెంట్లు విధులు బహిష్కరించడంతో పాటు ధర్నా చేస్తామని హెచ్చరించారు.

అక్కడ ఎన్నికలు లేనట్లే..!



జిల్లాలో...	
మండలాలు	16
గ్రామ పంచాయతీలు	311
మొత్తం వార్డులు	2,730
కార్పొరేషన్‌లో విలీన పంచాయతీలు	5
విలీన వార్డులు	50
ఎన్నికలు జరిగే పంచాయతీలు	306
ఎన్నికలు జరగనున్న వార్డులు	2,680

- మంచిర్యాల కార్పొరేషన్‌లో ఐదు జీపీల విలీనం
- పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ఆపాలని ఆదేశాలు
- 'సర్పంచ్' ఆశావహులకు నిరాశ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌గా మారడంతో హాజీపూర్ మండలంలోని ఐదు గ్రామ పంచాయతీలు మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమయ్యాయి. ఇప్పటికే మండలంలోని గ్రామ పంచాయతీల బోర్డులు వార్డు కార్యాలయాలుగా మారిపోయాయి. నాలుగు రోజుల్లో పంచాయతీ రికార్డులు కూడా కార్పొరేషన్ కార్యాలయంలో అప్పగించడానికి ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. మార్చి 21లోగా పంచాయతీ ఎన్నికల నిర్వహణపై కసరత్తులో భాగంగా కార్పొరేషన్‌లో విలీనం చేసిన గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లా పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. విలీన గ్రామాలైన హాజీపూర్ మండలంలోని వేంపల్లి, ముల్కల్ల, గుడిపేట, నంనూర్, నర్సింగాపూర్ పంచాయతీల్లో వార్డులు, జనాభా, ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలకు సంబంధించి పూర్తి నివేదిక కార్పొరేషన్ పరిధిలోకి వెళ్లనున్నాయి. గ్రామాలు కార్పొరేషన్‌లో విలీనం కావడంతో సర్పంచులుగా పోటీ చేద్దామనుకున్న ఆశావహులతో పాటు యువత ఆశలకు గండి పడినట్లయ్యింది. ఇన్నాళ్లు వ్యూహాత్మకంగా వ్యవహరించగా, కార్పొరేషన్‌లో విలీనం కానుండటంతో ఒక్కసారిగా నిరాశకు లోనవుతున్నారు.

విలీన గ్రామాల వివరాలు

గ్రామం	జనాభా	వార్డులు	ఓటర్లు
వేంపల్లి	2,081	10	2,149
ముల్కల్ల	3,074	12	2,824
గుడిపేట	2,748	10	2,060
నంనూర్	2,846	10	2,396
నర్సింగాపూర్	1,487	8	1,269
మొత్తం	12,236	50	10,698

రికార్డులు అప్పగిస్తున్నాం..



మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం అయిన ఐదు గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు ఉండవు. విలీనమైన గ్రామాల జనాభా, ఓటర్లు, పోలింగ్ కేంద్రాలు పునర్విభజన పనులు వేగవంతంగా సాగుతున్నాయి. పంచాయతీల పన్నుల డిమాండ్, వసూళ్లు, అభివృద్ధి నిధులు, ఖర్చులు, రోడ్లు, గ్రామ వైశాల్యం, తదితర పూర్తి రికార్డులన్నీ కూడా కార్పొరేషన్‌కు అప్పగిస్తున్నాం. 5పంచాయతీలతో పాటు 50వార్డుల వివరాలు పంచాయతీ రాజ్ నుంచి తొలగిస్తున్నాం.

- వెంకటేశ్వర్‌రావు, డీపీవో

మున్సిపాలిటీల అభివృద్ధికి చర్యలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



రామకృష్ణాపూర్: నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్

రామకృష్ణాపూర్/మందమర్రిరూరల్: మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. క్యాతనపల్లి, మందమర్రి మున్సిపల్ కార్యాలయాలను మంగళవారం ఆయన సందర్శించారు. రిజిష్టర్లను పరిశీలించి మున్సిపాలిటీల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని క్యాతనపల్లిలో మున్సిపల్లి కమిషనర్ రాజును, మందమర్రిలో కమిషనర్ రాజలింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. వేసవి సమీపిస్తున్న దృష్ట్యా తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రతీ ఇంటికి నిరంతరాయంగా నీటి సరఫరా జరిగేలా చూడాలన్నారు. ప్రతీ ఇంటి నుంచి తడి, పొడిచెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. అనంతరం నర్సరీలను సందర్శించారు. నిర్దేశించిన మొక్కలను నాటేందుకు నర్సరీలో మొక్కలు సిద్ధం చేయాలన్నారు.

రైతులు పంట మార్పిడి చేయాలి

- జిల్లా వ్యవసాయాధికారి కల్పన



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారిణి కల్పన

కాసిపేట: రైతులు పంట మార్పిడి చేయాలని, ఒకే రకమైన పంట వేయడం వల్ల పంట దిగుబడి తగ్గడమే కాక భూమి నిస్సారమై చీడ పీడల ఉధృతి పెరుగుతాయని జిల్లా వ్యవసాయాధికారి కల్పన తెలిపారు. మండల కేంద్రంలోని ముత్యంపల్లి రైతు వేదికలో మంగళవారం రైతునేస్తం కార్యక్రమం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. రైతునేస్తంలో అడవి పందులతో కలిగే నష్టాలు, నివారణ చర్యలపై వీడియో ప్రదర్శన ద్వారా వివరించారు. నివారణకు సోలార్ కంచెల ఏర్పాటు, జీవ కంచెల ఏర్పాటు, ఇతర పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సీహెచ్ ప్రభాకర్, ఏఈవో రమ్య, రైతులు పాల్గొన్నారు.

పత్తి అమ్మకానికి 'టోకెన్'



టోకెన్ల కోసం గుమి గూడిన రైతులు

చెన్నూర్‌రూరల్: పది రోజులుగా సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిపివేసింది. దీంతో రైతులు పత్తిని ఇళ్లలో నిల్వ ఉంచారు. బుధవారం నుంచి తిరిగి కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. దీంతో పత్తి అమ్మడానికి మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద మంగళవారం టోకెన్లు అందించారు. సీసీఐ ఆదేశాల మేరకు రోజుకు 40వాహనాలకు మాత్రమే టోకెన్లు ఇవ్వాలని చెప్పడంతో రైతులు నిరాశకు గురయ్యారు. బుధవారం రోజుకు మార్కెట్ యార్డులో ఉన్న పత్తి వాహనాలకు టోకెన్లు ఇచ్చారు. అలా కాకుండా పత్తి వాహనాలు లేకున్నా గురువారం రోజుకు కూడా టోకెన్లు ఇచ్చారని, ఇలా అయితే మేము పత్తి ఎప్పుడు అమ్ముకోవాలని రైతులు వాపోతున్నారు. ఎప్పటి లాగే టోకెన్లు లేకుండా నేరుగా పత్తి మిల్లులోనే సీసీఐ ద్వారా కొనుగోళ్లు జరపాలని రైతులు కోరుతున్నారు.

'ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి'



దండేపల్లి: మాట్లాడుతున్న దివాకర్‌రావు

దండేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పిలుపునిచ్చారు. దండేపల్లి పద్మశాలీ భవన్‌లో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దివాకర్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతుందని, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. పార్టీకోసం ప్రతీ కార్యకర్త పనిచేయాలన్నారు. రాష్ట్ర నాయకులు విజిత్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ లింగన్న, వైస్ చైర్మన్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/దండేపల్లి/కోటపల్లి: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగా ఆధ్వర్యంలో ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే 'లక్ష డప్పులు–వేల గొంతుకలు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. కోటపల్లి, దండేపల్లి, హాజీపూర్ మండలాల్లో మంగళవారం మహాసభకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి మంగళవారం కమలనాథులు సామూహికంగా తరలివచ్చి అంబేడ్కర్ విగ్రహం వద్ద క్షీరాభిషేకం నిర్వహించారు. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో మధ్య తరగతి ప్రజలకు మేలు చేకూర్చేలా ఆదాయపు పన్ను పరిమితిని రూ.12లక్షలకు పెంచడాన్ని స్వాగతిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ సంతోష్, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షురాలు కళ్యాణి, తాండూర్ మండల ఇన్‌చార్జి మద్దెర్ల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వ నిర్ణయం సరికాదు'

శ్రీరాంపూర్: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరికాదని జాతీయ మాల మహనాడు జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింగ్, అధికారి ప్రతినిధి తలారి రాజు, నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి ఐత పరమేశ్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్గీకరణపై కమిషన్ ఇచ్చిన నివేదికను ప్రభుత్వం ఆమోదించడం ఏకపక్ష విధానమన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనుక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గీత వృత్తిలో రక్షణగా కాటమయ్యకిట్లు

- అదనపు కలెక్టర్ మోతీలాల్



శిక్షణను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

దండేపల్లి: కల్లుగీత వృత్తిదారులకు తాటి చెట్లు ఎక్కేందుకు కాటమయ్య కిట్లు ఎంతో రక్షణగా ఉంటాయని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. ప్రభుత్వం గీతకార్మికులకు అందిస్తున్న కాటమయ్య రక్షణ కిట్లపై దండేపల్లి మండలం నర్సాపూర్ గ్రామంలో మండలంలోని నంబాల, నాగసముద్రం, కన్నెపల్లి, నర్సాపూర్ గ్రామాల గీత కార్మికులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ హాజరై మాట్లాడారు. గీత కార్మికులు తాటిచెట్లు ఎక్కే సమయంలో అక్కడక్కడా ప్రమాదాల బారినపడుతున్నారు. వాటిని నివారించడం కోసం ప్రతీ కల్లుగీత కార్మికుడికి తాటిచెట్లు ఎక్కేందుకు ప్రభుత్వం కాటమయ్య రక్షణ కిట్లు అందించిందని, వీటిని గీతకార్మికులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కాటమయ్య రక్షణ కిట్ల రాష్ట్ర కో ఆర్డినేటర్ వెంకటేశం, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి పురుషోత్తం నాయక్, లక్సెట్టిపేట ఎక్సైజ్ సీఐ సమ్మయ్య, ఎస్సై మౌనిక, గౌడ సంఘం దండేపల్లి మండల అధ్యక్షుడు బండి రవిగౌడ్, వివిధ గ్రామాల గీత కార్మికులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

- ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ప్రవీణ్



పైపులు పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ప్రవీణ్

నెన్నెల: వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ప్రవీణ్, ఏఈ శ్రీనాథ్‌లు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల కేంద్రంలోని నీటి ట్యాంకులో తాగునీటి పైపులైన్‌లను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాగునీటి పైపులైన్లు లీకేజీ లేకుండా చూసుకొని, అన్ని గృహాలకు నీటి సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. మిషన్ భగీరథ నీరు సురక్షితమైందని, ప్రజలు ఈ నీటిని వాడుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఎనిమిది రిజిష్టర్లు పరిశీలించి కార్యదర్శులకు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, కార్యదర్శి సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రీడా సామగ్రి అందజేస్తున్న సీఐ కుమారస్వామి

భీమిని: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, సమాజంలో ఆదర్శంగా నిలవాలని తాండూర్ సీఐ కుమారస్వామి అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మంగళవారం కేస్లాపూర్‌లో యువకులకు వాలీబాల్ కిట్లు అందజేశారు. యువత క్రీడలతో పాటు చదువులో రాణించాలన్నా రు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఎస్సై విజయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్ ప్రారంభిస్తున్న డాక్టర్ ఎగ్గన శ్రీనివాస్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్‌లో ఎస్‌పీఎల్ 3 బ్లడ్ అవేర్‌నెస్ క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం డాక్టర్ ఎగ్గెన శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు పలు ప్రాంతాల నుంచి క్రికెట్ టీంలు రాగా రక్తదానంపై అవగాహన కల్పిస్తూ క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో వార్డు నాయకులు బదావత్ ప్రకాశ్‌నాయక్, బెక్కం రాజారాం, సంపత్, టోర్నమెంట్ ఆర్గనైజర్లు హరీశ్, ఎస్‌కె తాజ్, ఎగ్గెన సాయి పాల్గొన్నారు.

గాంధారి ఖిల్లా మైసమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ మహేంద్రనాథ్

కోటపల్లి: మంచిర్యాల జిల్లా బొక్కలగుట్ట సమీపంలో ఈ నెల 14నుంచి రెండు రోజుల పాటు జరిగే గాంధారిఖిల్లా మైసమ్మ జాతర పోస్టర్‌ను మంగళవారం కోటపల్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మహేంద్రనాథ్ ఆవిష్కరించారు.ఈ మహాజాతరకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆదివాసీ తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు జేక శేఖర్ కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ తిరుపతి, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్..

ఆరోగ్య ఉపకేంద్రం భవనం అసంపూర్తి



భీమారం: మండలంలోని దాంపూర్ గ్రామంలో పదిహేనేళ్ల క్రితం ప్రారంభించిన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణ పనులు నేటికీ పూర్తి కాలేదు. దీంతో ఉపకేంద్రాన్ని ప్రైవేట్ భవనంలో అద్దెకి తీసుకొని నడిపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకొని ఆరోగ్య ఉపకేంద్రాన్ని పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంబంధిత అధికారి : ముస్తాఫా, మెడికల్ ఆఫీసర్, జైపూర్ ఫోన్ నంబర్ : 98858 50583

కార్మికులకు ప్రోత్సాహక బహుమతులు



బహుమతి అందిస్తున్న గని మేనేజర్ లక్ష్మీనారాయణ

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట 2ఇంక్‌లైన్ గనిపై మంగళవారం గని మేనేజర్ లక్ష్మీనారాయణ ఉత్పత్తి సాధనలో ముందున్న 15మంది కార్మికులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధిస్తూ సంస్థ మనుగడకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలన్నారు. కార్మికుల గుర్తింపు, ప్రోత్సాహం ఉత్పత్తిలో ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గని పిట్ కార్యదర్శి శ్రీనివాస్, అధికారులు, సూపర్‌వైజర్లు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

'మారు పేర్ల సమస్య పరిష్కరించాలి'

శ్రీరాంపూర్: సింగరేణిలో మారు పేర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు యాజమాన్యంను కోరారు. ఆ యూనియన్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎస్‌ఓటుజీఎం సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచీ అధ్యక్షుడు గొల్ల బాలాజీ, నాయకులు వెంగళ శ్రీనివాస్, కస్తూరి చంద్రశేఖర్, శైల శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, సిరికొండ శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.

సీఎండీని కలిసిన 'గుర్తింపు' నేతలు

శ్రీరాంపూర్: హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌ను గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎండీగా మరో సంవత్సరం ఆయన పదవీ కాలం పొందిన సందర్భంగా అభినందనలు తెలిపారు. అనంతరం ఉద్యోగుల సమస్యలు, సంస్థ విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు ఉన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

- జీఎం ఎల్వీ సూర్యనారాయణ

శ్రీరాంపూర్: క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ తెలిపారు. సీసీసీలోని ఆఫీసర్స్ క్లబ్‌లో మంగళవారం సింగరేణి వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మహిళలకు క్యాన్సర్‌పై వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై వ్యాధిపై అవగాహన కల్పించే కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఏరియా సేవా అధ్యక్షురాలు మాలతి మాట్లాడారు. మహిళలకు వచ్చే రొమ్ము, గర్భాశయ క్యాన్సర్, జబ్బులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్లు రమేష్ బాబు, ప్రసన్నకుమార్, ఏరియా ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, ఇన్‌చార్జి డీజీఎం పర్సనల్ రాజేశ్వర్, సీనియర్ పీవో కాంతారావు, వైద్యులు పాల్గొన్నారు.

'భూ వివాదంలో ఇబ్బందులు పెడుతున్న ఎస్సై'

భీమారం: మండల కేంద్రంలోని సర్వే నంబర్ 651లో భూమి వివాదం కోర్టులో ఉండగా ఎస్సై శ్వేత తమపై బెదిరింపులకు పాల్పడుతుందని భీమారంకు చెందిన రేషవేని రాజం, అతడి కుమారుడు లక్ష్మణ్ ఆరోపించారు. మండల కేంద్రంలో మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. కోర్టులో కేసు నడుస్తున్న భూమిలో ఈ నెల 2న కేసులో ఉన్న వ్యక్తులు చదును చేసేందుకు జేసీబీతో రావడంతో అడ్డుకున్నట్లు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసుస్టేషన్‌కి పిలిపించారని, స్టేషన్లో ఎస్సై తనపై దుర్భాషలాడారన్నారు. తన ప్రతివాదికి ఎస్సై మద్దతుగా నిలిచి, కోర్టులో ఉన్న భూ వివాదంలో కలుగజేసుకొని భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు ఆరోపించారు. భూ వివాదంలో పోలీసులు జోక్యం చేసుకోకుండా చూడాలని జైపూర్ ఏసీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎస్సై శ్వేతను 'సాక్షి' వివరణ కోరగా బెదిరింపులకు పాల్పడ్డామని అనడం అవాస్తవమన్నారు. ఇరు పార్టీల వారికి భూమికి సంబంధించిన పత్రాలు పరిశీలించిన అనంతరం చర్యలు ఉంటాయని తెలిపారు.